క్లుప్తంగా

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

ఎస్పీ బిందుమాధవ్



దాచేపల్లి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ కోరారు. మండలంలోని గామాలపాడు గ్రామంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సోదర భావంతో ఎన్నికల్లో పాల్గొనాలని ఆయన కోరారు. అంతకుముందు పొందుగల గ్రామంలోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద జిల్లా ఎస్పీ తనిఖీలు చేపట్టారు. సీఐ ఎ.సురేంద్రబాబు, ఎస్‌ఐలు జి.సంధ్యారాణి, దాసరి శివనాగరాజు ఉన్నారు.

సీఐ నారాయణస్వామి బాధ్యతల స్వీకరణ



కారెంపూడి: ఎన్నికల నేపథ్యంలో కారెంపూడి సీఐగా నారాయణ స్వామి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సీఐ చిన మల్లయ్యను ఎన్నికల కమిషన్ విధుల నుంచి తప్పించింది. నారాయణ స్వామికి గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పని చేసిన అనుభవం ఉంది. శాంతి భద్రతలను పరిరక్షించి, ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

వెల్దుర్తి నూతన ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



వెల్దుర్తి: మండల ఎస్‌ఐగా వెంకట్రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన ఇ.శ్రీహరి వీఆర్‌కు వెళ్లారు. నర్సరావుపేట దిశా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న వెంకట్రావు బదిలీపై వచ్చారు. గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

పిడుగురాళ్లలో సాయుధ బలగాల కవాతు



పిడుగురాళ్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పిడుగురాళ్ల పట్టణంలో ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణ పోలీసులతో పాటు ప్రత్యేక సాయుధ బలగాలు కవాతులో పాల్గొన్నాయి. పోలీసు స్టేషన్ సెంటర్ నుంచి తహసీల్దారు కార్యాలయం కవాతు సాగింది. ఈ సందర్భంగా పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు మాట్లాడుతూ.. అల్లరి మూకలు అల్లర్లకు పాల్పడితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. పట్టణ ఎస్‌ఐ అమీర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ సీఐగా బ్రహ్మయ్య బాధ్యతలు



మాచర్ల: మాచర్ల పట్టణ అర్బన్ సీఐగా బి.బ్రహ్మయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఐగా పనిచేసిన శరత్‌బాబును బదిలీ చేశారు. ఆయన స్థానంలో బ్రహ్మయ్య బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి.. రాగి తీగ చోరీ



శావల్యాపురం: మండలంలోని గుంటుపాలెంలో వ్యవసాయ భూముల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి.. అందులో ఉన్న రాగితీగను చోరీ చేసినట్లు రైతు పురేటి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.లక్షల వెచ్చించి ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి అందులో ఉన్న కాపర్, రాగి తీగలను చోరీ చేసి అమ్ముకుంటారని చెప్పారు. ఇలాంటి ఘటనలు భాస్కర్‌నగర్, చినకంచర్ల పొలాల్లో ఇటీవల చోటు చేసుకున్నాయన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

గురజాల అభివృద్ధే అజెండా

- సుదీర్ఘ సమస్యలెన్నో పరిష్కరించాం
- ఐదేళ్ల పాలనలో సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట
- విద్య, వైద్య రంగాల్లో గురజాలను మోడల్‌గా తీర్చిదిద్దుతున్నాం
- 'సాక్షి'తో గురజాల ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి



సాక్షి ఇంటర్వ్యూ

గురజాల : ఆయన ముక్కుసూటి మనిషి, సమస్యల పరిష్కారంలో నాన్చివేత ధోరణి ఉండదు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజల సంక్షేమానికి ఐదేళ్లు అహర్నిశలు పాటుపడ్డారు. గత పాలకులు ఎవరూ చేయలేని అభివృద్ధి చేసి శభాష్ అనిపించుకున్నారు. పేదలకు సొంత గూడు కల్పించడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని, పల్నాడు ప్రాంతానికి విద్య, వైద్యం పరంగా ఇబ్బందులు లేకుండా చేశామని గురజాల ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి అంటున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్న ఆయన.. నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలు ఈసారి తనకు అఖండ విజయాన్ని అందిస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఐదేళ్ల పాలన ఎలా సాగిందనుకుంటున్నారు..

చాలా అద్భుతమనే చెప్పాలి. కనీవిని ఎరుగని సంక్షేమం పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఈ ఐదేళ్లలో జరిగాయి. గతంలో ఏ ప్రభుత్వం పేదల కోసం ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసింది లేదు. పేదలకు మేలు చేయాలని ఇంత లోతుగా ఆలోచన చేసిన ముఖ్యమంత్రి లేరు.. తండ్రి కంటే రెండడుగులు ముందుకేసి చరిత్రలో నిలిచిపోయే పాలనను సీఎం వైఎస్ జగన్ అందించారు. ప్రజల హృదయాల్లో గూడుకట్టుకున్నారు.

గర్వంగా చెప్పుకునే అంశాలు ఏం ఉన్నాయి..

పల్నాడు ప్రాంతంలోని గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో సరైన వైద్య సౌకర్యాలు లేవు. కావున పిడుగురాళ్ల సమీపంలో 600 పడకల వైద్యశాల ఏర్పాటు చేశాం. వైద్య కళాశాలను తీసుకొచ్చాం.. విద్య, వైద్యం పరంగా ఇబ్బందులు లేకుండా చేశాం. 900 ఏళ్ల చరిత్ర కలిగిన గురజాల, దాచేపల్లి గ్రామాలను నగర పంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేశాం.

ప్రజా క్షేత్రంలో మీ గుర్తింపు ఏంటి..

ప్రజలు నన్ను ఎంతో ఆదరిస్తున్నారు. ఎంతో ఆప్యాయంగా ప్రతి గ్రామంలో ఆహ్వానిస్తున్నారు. మేము చేసిన మంచి పనులను స్వీకరిస్తున్నారు. నియోజకవర్గంలో మేము నేరుగా ప్రజల వద్దకు వెళ్లాం.

ఐదేళ్లలో ప్రజల జీవనశైలి మారిందంటారా..

ప్రజలు గౌరవాన్ని కోరుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు జరిపిన సంక్షేమ పథకాలు వారి జీవన విధానంలో మార్పులు తీసుకొచ్చాయి. ముఖ్యంగా పేద వర్గాల అభివృద్ధికి దోహదపడుతున్నాయి. విద్య, వైద్యం, ఆరోగ్యం, పాఠశాలలు, రైతు మహిళా సంక్షేమం వెల్లివిరుస్తోంది. ప్రభుత్వ వైద్యశాలలకు నేడు ప్రజలు వైద్యం కోసం క్యూ కడుతున్నారంటే జగన్ పాలన ఏ విధంగా ఉందో స్పష్టమవుతుంది.

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎలా అనిపించింది..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రతి నాయకుడికి పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టింది. మేము గ్రామాల్లో చేసిన పనులు వారికి వివరించాం. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే అవకాశం లభించింది. ప్రజలు వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్న నాయకుడిగా ఉండిపోయాం.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి ఏంటి..

నియోజకవర్గంలోని ప్రజల చిరకాల కోరిక సొంతింటి కల. ప్రతి ఎన్నికల్లో ఇది వాగ్దానంగానే మిగిలిపోయేది. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే 22 వేల మందికి ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేశాం. వాటిలో ప్రతి ఒక్కరూ ఇల్లు నిర్మించుకుంటున్నారు. బ్రిటిష్ కాలంలో చేపట్టిన భూ సర్వే అనంతరం ఇంత వరకు ఎవరూ సర్వే చేయలేదు. భూ సర్వే ద్వారా ఎన్నో ఏళ్ల నాటి నుంచి ఉన్న భూ తగాదాలకు శాశ్వతంగా పరిష్కారం లభించింది.

గ్రామాల అభివృద్ధికి మీరు తీసుకున్న చర్యలు

గ్రామ స్వరాజ్యానికి బాటలు వేస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా సచివాలయాలు , రైతు భరోసా కేంద్రాలు నిర్మించాం. విద్యుత్ సమస్య ఉన్న గ్రామాల్లో సబ్ స్టేషన్‌లు నిర్మాణం చేపట్టాం. ప్రతి ఇంటికి మంచి నీటిని అందించేందుకు జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.218 కోట్లతో పనులు చేపడుతున్నాం. త్వరలో ప్రతి ఇంటికి మంచి నీటిని అందించడం జరుగుతుంది.

గురజాలలో గుర్తిండిపోయేలా ఏం చేశారు..

చరిత్ర కలిగిన గురజాల- జంగమహేశ్వరపురం, దాచేపల్లి-నడికూడి గ్రామాలను విలీనం చేసి నగర పంచాయతీలుగా మార్చాం. రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల, 600 పడకల వైద్యశాల, రూ.82 కోట్లతో పిడుగురాళ్ల బైపాస్, రూ.52 కోట్లతో పిడుగురాళ్ల జానపాడు బ్రిడ్జి, దాచేపల్లి-మాచర్ల వయా గురజాల మీదుగా సుమారు రూ.394 కోట్లతో జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాం. రూ.218 కోట్లతో మునిసిపాలిటీ, నగర పంచాయతీలతో పాటు 57 గ్రామాలకు తాగునీటి పథకం ద్వారా నీటిని అందిస్తాం.

చివరిగా నియోజకవర్గ ప్రజల గురించి..

నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశాం. ప్రతి ఒక్కరికి అర్హతను బట్టి సంక్షేమ పథకాలు అందించాం. రానున్న ఎన్నికల్లో కూడా ప్రజలు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. గురజాల ప్రజలు నన్ను ఎప్పటికి ఆదరిస్తూనే ఉంటారు. ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి. ఈ ప్రాంతంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం అవసరం.

ముస్లింలకు ఎల్లవేళలా అండగా ఉంటా

మాచర్ల వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల: ఎల్లవేళలా ముస్లిం సోదరులకు అండగా ఉంటానని మాచర్ల వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎర్రబాలెం కాలనీలోని షాదీ ఖానాలో ఏర్పాటు చేసిన ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. స్థానిక ముస్లిం సోదరులు అడిగిన వెంటనే రూ.40 లక్షల వ్యయంతో షాదీఖానా నిర్మించి, ఈ ఏడాది రంజాన్ పర్వదినానికి కానుకగా అందచేసినట్లు గుర్తుచేశారు. ఈద్గా నిర్మాణానికి స్థల సమస్యను స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. దీంతో తను చెప్పిన వెంటనే గ్రామానికి చెందిన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెర్ల సత్య వెంకట రామిరెడ్డి (రాంబాబు) ముందుకొచ్చి, రేగుల మాన్యం కాలనీలో సుమారు రూ.30 లక్షల విలువైన ఎకరం భూమిని ఈద్గా నిర్మాణానికి విరాళమిచ్చారని తెలిపారు. దాతను అభినందించారు. ఈద్గా నిర్మాణం కూడా చేపట్టి ముస్లింలకు అండగా ఉంటానని పీఆర్కే భరోసానిచ్చారు. సీఎం వైఎస్ జగన్ ముస్లిం 4 శాతం రిజర్వేషన్‌కు కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం పీఆర్కేను, భూమి విరాళమిచ్చిన దాత రాంబాబును ముస్లింలు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ పేర్ల చౌడమ్మ, ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పూజల రామయ్య, పార్టీ మండలాధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఉమ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, పార్టీ నాయకులు ఇన్నారెడ్డి, ముత్తయ్య, మర్రెడ్డి, మర్కస్ మస్జీద్ కమిటీ చైర్మన్ షేక్ తండా సైదా, అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖయ్యూమ్, మస్జీద్ కమిటీ సభ్యులు షేక్ చాంద్ బాబు, షేక్ దస్తగిరి, బాలాల్, ఇమామ్‌సా, షేక్ ఇంతియాజ్, మండల ఇమాముల అధ్యక్షుడు షేక్ మహ్మద్ షఫీ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కె.పాపయ్య



తుమ్మకోట గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పాపయ్య

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కె.పాపయ్య కోరారు. శుక్రవారం తుమ్మకోట గ్రామంలో ఆయన పర్యటించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ తమ బృందం ఎన్నికల ప్రక్రియ పూర్తియ్యే వరకు మండల పరిధిలోని గ్రామాల్లో పర్యటిస్తుందని చెప్పారు. శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భారీగా నగదు, మద్యం, బంగారం, వెండి ఇతర విలువైన వస్తువులు తరలించడం నేరమని, గ్రామాల్లో ఎక్కడైనా.. ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగితే.. వెంటనే సీ-విజిల్ యాప్ ద్వారా సమాచారం అందించాలని చెప్పారు. దీంతో ఫ్లయింగ్ స్క్వాడ్ క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

గిరిజనులు ఏకమై..పిన్నెల్లిని గెలిపించాలి



వడిత్యా శంకర్ నాయక్

విజయపురిసౌత్: సార్వత్రిక ఎన్నికల్లో గిరిజనులంతా ఏకమై మాచర్ల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గెలిపించాలని గిరిజన ప్రజా సమాఖ్య (జీపీఎస్) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్ కోరారు. శుక్రవారం విజయపురిసౌత్‌లో ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఒక్క వైఎస్ జగన్ మాత్రమే అమలు చేశారన్నారు. విద్య, వైద్య, రాజకీయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పేద గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు గిరిజనులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారే తప్ప గిరిజనుల అభివృద్ధికి ఏనాడు కృషి చేయలేదని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో రెండు మెడికల్ కళాశాలలు, ఐదు ఐటీడీఏ ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణం, కురుపాంలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అలాగే 497 సచివాలయాల ద్వారా స్థానిక గిరిజనులకే ఉద్యోగాలు కల్పించారని, గిరిజన ఆవాసాల్లో 200 యూనిట్లు వరకు విద్యుత్ ఉచితంగా అందించి, (ఆర్వోఎస్ఆర్) చట్టం ద్వారా 1.54లక్షల గిరిజన కుటుంబాలకు 3,22,000 వేల ఎకరాల భూమి పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలి విజ్ఞప్తి చేశారు. ఇస్లావత్ హనుమంతు నాయక్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

జోరుగా వైఎస్సార్ సీపీ శ్రేణుల ప్రచారం



శ్రీనగర్‌లో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల నినాదం



దాచేపల్లిలో కరపత్రం అందజేస్తున్న నాయకులు

దాచేపల్లి: మండలంలోని శ్రీనగర్ గ్రామంలో జెడ్పీటీసీ సభ్యులు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ కూసం నాగిరెడ్డి, టిక్నో పెయింట్స్ అధినేత ఆకూరి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ ఆకూరి కాశిరెడ్డి వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. కేసానుపల్లిలో పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, ఎంపీటీసీ చెట్టిపోగు ఏసుదాసు, కన్వీనర్ మోమిన్ నాగుల్‌మీరా, నాయకులు బొలా శ్రీనివాసరావు, చుండు రామారావు, నెల్లూరి రామారావు, నెల్లూరి కోటేశ్వరరావు, ఉల్లేరు హనుమంతరావు, జక్కుల వీరాస్వామి, చిరంజీవి, బుల్లోడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కాసు మహేష్‌రెడ్డి, డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌ని గెలిపించాలని కోరారు. పెదగార్లపాడులో సర్పంచ్ కర్పూరపు వెంకట కోటయ్య, ఎంపీపీ కటకం జయశ్రీ, కటికాల వరలక్ష్మి, పుప్పాల శివ, ముత్యం చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. తక్కెళ్లపాడు గ్రామంలో ఎంపీటీసీ జంగిలి నరసింహారావు, గ్రామ కన్వీనర్ మేడతి నరసింహారావు, మాజీ ఎంపీటీసీ గుడూరి గోవర్ధన్‌రావు, రాచకొండ కోటయ్య ప్రచారం నిర్వహించారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి జగనన్న కృషి

వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంత్ నాయక్



కరపత్రాలు అందజేస్తున్న హనుమంతు నాయక్

మాచర్ల రూరల్: బలహీన వర్గాలు, పేద, బడుగు గిరిజనులకు మేలు జరగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతు నాయక్ అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కొప్పునూరు, హసనాబాద్ తండాలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయా తండాల్లోని గిరిజన కుటుంబాలను కలిసి వైఎస్సార్ సీపీ చేసిన అభివద్ధిని వివరించారు. మే 13న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి మాచర్ల అభ్యర్థి పిన్నెల్లి రామకష్ణారెడ్డిని, నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. తన మంత్రి వర్గంలో గిరిజనులకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తిరుపతి, శ్రీశైలం దేవస్థానం పాలక మండలిలో మొదటిసారిగా మెంబర్లుగా పదవులివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు సభావత్ రవినాయక్, గిరిజన నాయకులు రమావత్ మాద్యా నాయక్, కేతావత్ శ్రీనునాయక్, ఎస్.రంగానాయక్, రఘునాయక్, బాలునాయక్, అంజనీకుమార్ నాయక్, స్వతంత్ర నాయక్, రామూనాయక్ పలువురు పాల్గొన్నారు.

గణపవరంలో కొనసాగిన రీపోలింగ్

- ఓటేసిన 2416 మంది ఉద్యోగులు
- హోం ఓటింగ్ ద్వారా ఓటేసిన 156 మంది



బూత్‌ను పరిశీలిస్తున్న ఏఈఆర్వో గోవిందంరావు

నాదెండ్ల: గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రీపోలింగ్ ప్రక్రియ కొనసాగింది. గురువారం రాత్రి చిలకలూరిపేట ఎన్నికల అధికారులతో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 5న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో 1,219 ఓట్లు పోలయ్యాయి. ఎమ్మెల్యే అభ్యర్థి ఓటు సజావుగా సాగినా, ఎంపీ అభ్యర్థి పోస్టల్ బ్యాలెట్ ఓటు రీ-పోలింగ్ జరిగింది. 8, 9 తేదీల్లో రీపోలింగ్ జరగ్గా, 1,219కి గాను 32 ఓట్లు పోలవ్వలేదు. దీంతో తిరిగి పోలింగ్ నిర్వహించాలని ఆదేశించటంతో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక బూత్ ఏర్పాటు చేశారు. 32 ఓట్లలో ఏడు ఓట్లు పోలయ్యాయి. దీంతో పాటూ మరో బూత్‌లో ఫారం-12 ద్వారా 11 ఓట్లు పోలయ్యాయి. ఈ నెల 5న 1,219 ఓట్లు పోలవగా, 6న 688, 7న 308, 8న 126, 9న 68, చివరిరోజు శుక్రవారం ఏడు ఓట్లు పోలయ్యాయి. మొత్తం 2,416 ఓట్లు పోలయ్యాయి. వీటితో పాటూ చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలో 159 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా, అధికారులు 156 మంది చేత ఓట్లు వేయించారు. మరో ముగ్గురిలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు ఇతర ప్రాంతాలకు వెళ్లినట్లు అధికారులు వెల్లడించారు. శుక్రవారం రీపోలింగ్ ప్రక్రియను ఏఈఆర్వో సీహెచ్ గోవిందంరావు పరిశీలించారు.

కొండరాళ్లను తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం

యడ్లపాడు: మండలంలోని బోయపాలెంలో వెంకటరమణ స్టోన్ క్రషర్, బాబా స్టోన్ క్రషర్‌ల నుంచి వేబిల్లులు లేకుండా కొండ రాయిని తరలిస్తున్న క్రమంలో ఈనెల 8న గుంటూరు జిల్లా మైనింగ్, విజిలెన్స్ ఏడీ శివాజీ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఘటనా స్థలంలో రెండు ప్రొక్లెయిన్లు, రెండు టిప్పర్లు స్వాధీనం చేసుకుని యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. నిందితులపై కేసుల నమోదు చేశారు. వెంకటరమణ స్టోన్ క్రషర్ మైనింగ్ శాఖకు రూ.1.49 లక్షలు జరిమానా చెల్లించడంతో రెండు టిప్పర్లు, ప్రొక్లయిన్లు యాజమాన్యానికి అప్పగించినట్లు ఏడీ శివాజీ శుక్రవారం తెలిపారు.

జగనన్నతోనే సంక్షేమాంధ్ర సాధ్యం

రెంటచింతల: రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం పరితపించే సీఎం జగనన్నతోనే సంక్షేమాంధ్ర సాధ్యమని వైఎస్సార్ సీపీ మాచర్ల అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం రాత్రి రెంటాల గ్రామంలో నర్సరావుపేట ఎంపీ అభ్యర్థి పి. అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి రెంటాల గ్రామ ప్రజలు పార్టీకి అండగా ఉంటున్నారన్నారు. గ్రామంలో కోట్ల రూపాలయలతో జరిగిన అభివృద్ధి, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని ఆధారంగా జగనన్నకు అండగా నిలుద్దామని కోరారు. కుల, మత, పార్టీలకు అతీతంగా పేద ప్రజల అభివృద్ధి కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. 13న ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సర్పంచ్ సీహెచ్ కిరణ్‌కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ నాగలక్ష్మి, పార్టీ నాయకులు పెద సీతారామిరెడ్డి, లక్ష్మారెడ్డి, పిచ్చిరెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రంగారెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ మృతి



రాజుపాలెం: రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని కేజీబీవీ వద్ద మాచర్ల-గుంటూరు రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు మండలం ప్రతికులాంక గ్రామానికి చెందిన బి.విజయ్‌కుమార్(35)తన లారీని రోడ్డు మార్జిన్‌లో ఆపుకుని టైర్లను చెక్ చేస్తుండగా అదే సమయంలో వెనుక నుంచి మరో లారీ ఢీకొనడంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ ఎస్కే అమీర్ బాష ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తొండపిలో ఫ్యామిలీ డాక్టర్

తొండపి(ముప్పాళ్ళ): తొండపిలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి 180 మందికి వైద్య సేవలందించారు. గర్భిణీలకు అవసరమైన టీకాలు వేశారు. అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్ళి అవసరమైన వైద్య సేవలందించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ సుగుణ, ఏఎన్ఎమ్‌లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమం లక్ష్యం



మతుకుమల్లిలో కరపత్రాలు అదజేస్తున్న రాములమ్మ



గన్నవరంలో స్థానిక మహిళలతో పీఆర్కే సోదరి నాగమణి

మాచర్ల రూరల్: వైఎస్ జగనన్నకు అండగా ఉండి.. మరోసారి ఆయనను సీఎంను చేసుకుందామని వైఎస్సార్ సీపీ మాచర్ల అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తల్లి రాములమ్మ, సోదరి జవ్వాజి నాగమణి కోరారు. శుక్రవారం గన్నవరం, మతుకుమల్లి గ్రామాల్లో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళా సంక్షేమం లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, సున్నా వడ్డీ రాయితీ, రుణ మాఫీ, మహిళలకు ఇంటి పట్టాలు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శివారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, పాపయ్య, సాంబశివారెడ్డి, మట్టారెడ్డి, రామకష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అనిల్, శ్రీనివాసరెడ్డి, అనిల్ కుమార్, ఏడుకొండలు పాల్గొన్నారు.

టీడీపీ మూకల దాడి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలు

రొంపిచర్ల: వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ గుండాలు దాడిచేసి గాయపర్చిన సంఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామ సమీపంలో నరసరావుపేట-చేజర్ల మార్గంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. పిల్లకత్తుల నాగరాజు, యల్లబోయిన కోటేశ్వరరావు మోటారు సైకిల్‌పై కొత్తపల్లికి వస్తుండగా, అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గంగూరి కోటేశ్వరరావు, పఠాన్‌సైదా దారికాచి కొట్టారు. నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను బీఎల్‌వోలు శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 5 నుంచి పదో తేది వరకూ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగిన విషయం విదితమే. మండల పరిధిలో 57 పోలింగ్ కేంద్రాలుండగా, ఒక్క గణపవరం గ్రామంలోనే 15 కేంద్రాలున్నాయి. ఈ పాఠశాలలో తొమ్మిది కేంద్రాలుండగా శుక్రవారంతో పోస్టల్ బ్యాలెట్ ముగియటంతో సాధారణ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో కేంద్రానికి బారికేడ్లు, టెంట్లు, తాగునీరు, లైటింగ్, ర్యాంపు ఏర్పాటు పరిశీలించారు.

సమర్థులను ఎన్నుకుందాం

సత్తెనపల్లి: స్వేచ్ఛగా ఓటు వేద్దాం ... సమర్థులను ఎన్నుకుందామని దళిత బహుజన రీసోర్స్ సెంటర్ గుంటూరు జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త మల్లెల చిన్నప్ప అన్నారు. గోరంట్ల లో శుక్రవారం ఓటర్ చైతన్య ప్రచారోద్యమం చేపట్టారు. ఓటు ప్రాథమిక హక్కు అని, ఓటు వేయటం కనీస భాధ్యత అన్నారు. కార్య క్రమంలో కమ్యూనిటీ లీడర్ నందిగామ.ప్రభుదాస్ పాల్గొ న్నారు.

270 మద్యం బాటిళ్లు స్వాధీనం



కారు డిక్కీలో మద్యం బాటిళ్లు పరిశీలిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నాదెండ్ల: మండలంలోని కనపర్రు గ్రామంలో కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. సుమారు 270 క్వార్టర్ సీసాలను కారు డిక్కీలో పెట్టుకుని నరసరావుపేట వైపు నుంచి కనపర్రు వైపునకు తీసుకెళ్తుండగా..సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ అధికారులు కారును ఆపి తనిఖీ చేశారు. కారులో గ్రామ టీడీపీ నాయకుడు ఉండటం గమనార్హం. అయితే పైరవీల అనంతరం గ్రామ నాయకుడి పేరును తప్పించి ఓ అనామకుడి పేరును నమోదు చేసినట్లు సమాచారం.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com